క్లుప్తంగా

ఓటరు దరఖాస్తులను క్షేత్రస్థాయిలో విచారించండి

• కమిషనర్ వికాస్‌మర్మత్



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ వికాస్‌మర్మత్

నెల్లూరు(బారకాసు): ఓటరు తుది జాబితా విడుదలైన తరువాత ఆన్‌లైన్ ద్వారా అందుకున్న ఫారం 6,7,8 ఓటరు దరఖాస్తులను క్షేత్రస్థాయిలో త్వరితగతిన విచారించి జాబితాలో సవరణలు చేయాలని ఎన్నికల విభాగాధికారులను నగర నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్, కమిషనర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ విభాగంలోని సమావేశ మందిరంలో నగర నియోజకవర్గ ఎన్నికల విభాగాధికారులు, సూపర్‌వైజర్లతో శనివారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఆర్వో మాట్లాడుతూ క్షేత్రస్థాయి విచారణ ప్రక్రియను వేగవంతంగా పూర్తిచేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో విచారణ పూర్తి చేసిన దరఖాస్తులను సవరణకు పైస్థాయి అధికారులకు త్వరితగతిన బదిలీచేయాలని సూచించారు.

ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల విభాగాధికారులు, సిబ్బంది అప్రమత్తతో విధులు నిర్వర్తించాలని నగర నియోజకవర్గ ఈఆర్వో, కమిషనర్ వికాస్‌మర్మత్ సూచించారు. కార్పొరేషన్‌లోని కమాండ్ కంట్రోల్ విభాగంలో నగర నియోజకవర్గానికి సంబంధించిన ఎన్నికల సెక్టార్ అధికారులు, ఏఈఆర్వోలు, అసెంబ్లీ లెవెల్ మాస్టర్ ట్రెయినర్స్‌తో సమీక్ష సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం నిబంధనలను క్రమశిక్షణతో పాటించాలన్నారు. ఎన్నికల సంఘం అందించే శిక్షణలో ఈవీఎం మెషీన్లు, వీవీ ప్యాట్లపై పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లోని వసతులను ఎప్పటికప్పుడు పరిశీలించుకోవాలన్నారు. మాక్ పోలింగ్ నిర్వహణకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఏఈఆర్‌ఓలు దేవీకుమారి, వెంకటేశ్వరరావు, ప్రసాద్‌రావు, సెక్టార్ అధికారులు, ఏఎల్ఎంటీలు, ఈడీటీ స్వర్ణ, టీపీఆర్‌ఓ ప్రసాద్, మేనేజర్ ఇనయతుల్లా, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన



నెల్లూరు(బారకాసు): వికసిత భారత్ సంకల్ప యాత్రలో భాగంగా నగరంలోని కొండాయపాళెం చర్చి సెంటర్, జెడ్పీ కాలనీలో కేంద్ర ప్రభుత్వ పథకాలపై శనివారం అవగాహన కల్పించారు.కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ చెన్నుడు పీఎం స్వనిధి పథకం, ముద్రలోన్, బ్యాంకు పథకాలపై అవగాహన కల్పించారు. అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బీజేపీ ప్రతినిధులు శ్రీనివాసులురెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, కార్పొరేషన్ ఉద్యానశాఖ ఏడీ ప్రదీప్‌కుమార్, ఫీల్డ్‌పబ్లిసిటీ ఆఫీసర్ నాగసాయిసూరి, సచివాలయ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

రేపు శివాజీ ఉత్సవం

నెల్లూరు సిటీ: మహావీరుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 19న నగరంలో శివాజీ ఉత్సవం నిర్వహిస్తున్నట్లు ఆ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కాకు మురళీరెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించిన ఆహ్వానపత్రికలను నగరంలోని వీఆర్సీ సెంటర్‌లోని ఉత్సవ కమిటీ కార్యాలయంలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 5 ఏళ్లుగా శివాజీ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా సోమవారం వీఆర్సీ మైదానం నుంచి గాంధీబొమ్మ, శివాజీ సెంటర్, ఏసీ సెంటర్, కనకమహల్, కొత్తహాల్, సండేమార్కెట్ మీదుగా తిరిగి వీఆర్సీ మైదానం వరకు యాత్ర నిర్వహిస్తున్నామని వివరించారు. నగర ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి హర్షవర్ధన్, ఉపాధ్యక్షులు పీజీ మహేష్, కార్యవర్గ సభ్యులు అమర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓటు వినియోగంపై 24న చర్చా వేదిక

నెల్లూరు(బారకాసు): పురమందిరం ప్రాంగణంలోని రీడింగ్‌రూములో ఈ నెల 24 ఓటు వినియోగంపై చర్చా వేదిక నిర్వహించనున్నట్లు ఏ ట్రస్ట్ ఫర్ ఆల్ సంస్థ అధ్యక్షులు అలహరి వెంకటేష్, చక్రవర్తి తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను నగరంలోని స్వతంత్ర పార్కులో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓటర్లకు ప్రోగ్రెస్ కార్డులు అందజేసి గుర్తింపు, గౌరవం ఇవ్వడం వల్ల ప్రతి ఎన్నికల్లో 90 శాతం ఓట్లు నమోదవుతాయన్నారు. ఒక్క దొంగ ఓటు నమోదు కాదన్నారు. ఓటరు కాస్టింగ్ ప్రోగ్రెస్ కార్డు, ఇండియా ఓటర్స్ యాప్‌ను అమల్లోకి తీసుకురావాలనే అంశంపై నిర్వహిస్తున్న చర్చా వేదికలో నగర ప్రజలు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సింగంశెట్టి మురళి, సుబ్బారెడ్డి, శ్రీనివాసులు, వీఎస్‌రాజు, శామ్యూల్, శ్రీను, సునీల్ పాల్గొన్నారు.

కొద్దిరోజులు చికెన్ మానేయండి

• విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు
• చికెన్ దుకాణాలు తెరవకుండా చర్యలు



మనుబోలు : దుకాణదారునికి నోటీసు ఇస్తున్న అధికారులు

పొదలకూరు : కొద్దిరోజుల పాటు పొదలకూరు పరిసర ప్రాంత ప్రజలు చికెన్, కోడిగుడ్లు తినడం మానేయాలని వైద్యాధికారి డాక్టర్ నరసింహారావు సూచించారు. పట్టణంలో వైద్య ఆరోగ్య సిబ్బంది ద్వారా శనివారం ఇంటింటి సర్వే నిర్వహించి జ్వరాలు ఉంటే వెంటనే ఆశావర్కర్ దృష్టికి తీసుకురావాల్సిందిగా సూచించారు. దుకాణ సముదాయాల వద్ద బర్డ్‌ఫ్లూపై అవగాహన కల్పించారు. వ్యాధి ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా సూచించారు. కార్యక్రమంలో పొదలకూరు కో–లొకేటెడ్ పీహెచ్‌సీ వైద్యాధికారులు కిరణ్‌రిషిత, శ్రీకావ్య, స్రవంతి పాల్గొన్నారు.

కొడవలూరులో దుకాణాల మూత

కొడవలూరు: జిల్లాలో బర్డ్‌ఫ్లూ నిర్ధారణ కావడంతో చికెన్ దుకాణాల మూసివేతకు పంచాయతీ అధికారులు చర్యలు తీసుకున్నారు. కొడవలూరులోని చికెన్ దుకాణాలను శనివారం మూయించి మూడ్రోజుల పాటు తెరవొద్దని ఆదేశించారు. మూసివేసిన చికెన్ దుకాణాల వద్ద పారిశుద్ధ్య సిబ్బందితో బ్లీచింగ్ చల్లించి బర్డ్‌ఫ్లూ వ్యాధి ప్రబలకుండా చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఈఓపీఆర్డీ వి.డేవిడ్ మాట్లాడుతూ జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మూడ్రోజుల పాటు చికెన్ దుకాణాలు మూసివేసేలా చర్యలు తీసుకున్నామని, తదుపరి సూచనల మేరకు మాత్రమే దుకాణాలకు అనుమతిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జి.రాధాకృష్ణ, వీఆర్వో జి.రఘురామయ్య, వెల్ఫేర్ అసిస్టెంట్ బాలకృష్ణ పాల్గొన్నారు.

నోటీసుల జారీ

మనుబోలు : జిల్లాలో బర్డ్‌ఫ్లూ కలకలం రేగడంతో ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తమైంది. పొదలకూరు మండలం చాటగొట్లలో ఫ్లూ నిర్ధారణ కావడంతో డీపీఓ ఆదేశాల మేరకు ఎంపీడీఓ ప్రసాద్ చికెన్ దుకాణాలు తెరవద్దంటూ నోటీసులు జారీ చేశారు. పొదలకూరుకు సమీపంలో ఉన్న మండలంలోని వడ్లపూడి, గొట్లపాళెం, వీరంపల్లి గ్రామాల్లో శనివారం చికెన్ దుకాణాలు తెరవద్దంటూ యజమానులకు నోటీసులు అందజేశారు. తిరిగి నోటీసులు ఇచ్చే వరకూ షాపులు తెరవద్దని ఆదేశించారు. బర్డ్‌ఫ్లూపై అవగాహన కల్పించి చికెన్ తినవద్దని సూచించారు. ఆయన వెంట వడ్లపూడి సర్పంచ్ రమాదేవి, ఈఓపీఆర్డీ వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శులు తదితరులు ఉన్నారు.



కొడవలూరు: మూసివేసిన చికెన్ దుకాణం వద్ద బ్లీచింగ్ చేస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది



పొదలకూరు : దుకాణదారులకు అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

ముమ్మరంగా నివారణ చర్యలు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో బర్డ్‌ఫ్లూ నివారణ చర్యలను అధికారులు ముమ్మరం చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జెడ్పీ సీఈఓ కన్నమనాయుడు ఆధ్వర్యంలో దామరమడుగు, బుచ్చిరెడ్డిపాళెం పంచాయతీ పరిధిలోని చికెన్ దుకాణాలను అధికారులు శనివారం మూసివేశారు. మూడు రోజులపాటు తెరవొద్దని సూచించారు. బర్డ్‌ఫ్లూ నివారణ చర్యలపై దుకాణదారులకు అవగాహన కల్పించారు.

అవకతవకలకు పాల్పడితే చర్యలు



మాట్లాడుతున్న ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగమల్లీశ్వర్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : ఎన్నికల సమయంలో ప్రభుత్వ మద్యం షాపుల సూపర్‌వైజర్లు అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగమల్లీశ్వర్‌రెడ్డి సూచించారు. బుచ్చిరెడ్డిపాళెం ఎస్‌ఈబీ సర్కిల్ పరిధిలోని బుచ్చి, సంగం, దగదర్తి మండలాల్లో పనిచేస్తున్న సూపర్‌వైజర్లకు శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగమల్లీశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ సాధారణ ఎన్నికల నేపథ్యంలో రాజకీయ నేతలు ఒత్తిళ్లకు తలొగ్గి మద్యం అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మద్యం నిల్వలకు సంబంధించిన రికార్డులు ఎప్పటికప్పుడు పూర్తి చేయాలన్నారు. ఏ సమయంలో తనిఖీలు నిర్వహించి అవకతవకలకు పాల్పడితే సిబ్బందిని తొలగించేందుకు వెనుకాడబోమన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఈబీ సీఐలు యశోధర, వీరాంజనేయులు, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

కండలేరు చేపలవేలం రూ.95 వేలు



వేలం నిర్వహిస్తున్న అధికారులు

మనుబోలు : మనుబోలు పరిధిలోని కండలేరులో చేపలు పట్టుకునేందుకు స్థానిక పంచాయతీ కార్యాలయంలో శనివారం వేలం నిర్వహించగా గ్రామానికి చెందిన దువ్వూరు వెంకటరమణారెడ్డి రూ.95 వేలకు హక్కులు దక్కించుకున్నాడు. రూ.50 వేల కనీస ధరతో వేలం మొదలుపెట్టగా గరిష్టంగా రూ.95 వేలకు రమణారెడ్డి దక్కించుకున్నారు. చేపలు పట్టుకునేందుకు జూన్ 30 వరకు మాత్రమే గడువు నిర్ణయించారు. గత జూన్‌లోనే వేలం నిర్వహించాల్సి ఉండగా గతేడాది హక్కులు దక్కించుకున్న దువ్వూరు వెంకట రమణారెడ్డి తనకు నష్టం వచ్చిందని చెప్పడంతో దానిని పూడ్చుకునేందుకు ఇంతకాలం వేలం నిర్వహించకుండా నిలిపివేశారు.

గ్రామ సమస్యలపై నిలదీత

వేలం సందర్భంగా గ్రామ సమస్యలపై స్థానిక నేతలు దండు చంద్రశేఖర్‌రెడ్డి, అనమాల ప్రభాకర్ రెడ్డి, వార్డు సభ్యులు అధికారులను నిలదీశారు. చాలా కాలంగా శవపేటిక పాడైపోయి ఉండగా ఎందుకు రిపేరు చేయించలేదన్నారు. మురుగు కాలువల్లో పూడిక తీయకపోవడంతో పారిశుద్ధ్యం అధ్వానంగా తయారైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. చాలాచోట్ల వీధి లైట్లు వెలగకపోవడంతో అంధకారం అలుముకుంటోందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కంచి పద్మమ్మ, ఈఓపీఆర్డీ వెంకటరమణ, కార్యదర్శి శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

కంటేపల్లిలో కళాజాత



బాల్య వివాహాల గురించి అవగాహన కల్పిస్తున్న కళాకారులు

వెంకటాచలం: మండలంలోని కంటేపల్లి గ్రామంలో ఐసీడీఎస్, వీఎస్‌యూ ఎన్ఎస్ఎస్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో బాల్య వివాహాల వల్ల కలిగే ఇబ్బందులపై శనివారం కళాజాత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజమహేంద్రవరానికి చెందిన చిరంజీవి కళాబృందం వారిచే బాల్య వివాహాలు జరిపించడం వల్ల కలిగే ఇబ్బందులు, నష్టాల గురించి బుర్రకథ రూపంలో వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందిస్తున్న సేవల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పద్మజ, సీతాలక్ష్మి, ఎన్ఎస్ఎస్ యూనిట్–2 ప్రోగ్రామ్ అధికారిణి డాక్టర్ సునీత, ఐసీడీఎస్ ప్రొటెక్షన్ అధికారిణి సమత, తదితరులు పాల్గొన్నారు.

దేవస్థానాల్లో కాకాణి ప్రత్యేక పూజలు



పొదలకూరు : పట్టణంలోని అయ్యప్పనగర్‌లో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వర స్వామి వార్షికోత్సవ బ్రహ్మోత్సవాల్లో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి శనివారం పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత ఆలయ నిర్వాహకులు మంత్రికి స్వాగతం పలికి పూజా కార్యక్రమాలు జరిపించారు. దేవస్థానం చైర్మన్ మాలకొండారెడ్డి, అల్లూరు రమణయ్య తదితరులు పాల్గొన్నారు. నెల్లూరు రోడ్డులో ఉన్న శ్రీనివాస లేఅవుట్‌లో ఉన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో మంత్రి కాకాణి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన నిర్వాహకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. పూజా కార్యక్రమాల్లో దేవస్థానం కార్యదర్శి వాకాటి శ్రీనివాసులురెడ్డి, గౌరవాధ్యక్షుడు కోనం చినబ్రహ్మయ్య, పార్టీ నేతలు దేవరం రఘురామిరెడ్డి, పెదమల్లు రమణారెడ్డి, అంజాద్, చొప్పా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మరోసారి సోమిరెడ్డి నవ్వులపాలు



చెముడుగుంట యువకులకు టీడీపీ కండువాలు కప్పిన సోమిరెడ్డి



వైఎస్సార్‌సీపీలోనే కొనసాగుతామని మంత్రి వద్దకు చేరిన చెముడుగుంట యువకులు

వెంకటాచలం: టీడీపీలో చేరికలంటూ సోమిరెడ్డి చేసే ఫేక్ ప్రచారాలతో తరచూ ఆయన నవ్వుల పాలవుతున్నాడు. సర్వేపల్లి నియోజకవర్గంలో వరుసగా నాలుగు దఫాలు ఓటమిపాలైన సోమిరెడ్డికి చంద్రబాబు ఈదఫా టిక్కెట్ ఇస్తాడో లేదోననే ఆందోళనలో దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నాడు. నిత్యం ఏదో ఒక గ్రామాన్ని ఎంచుకుని కార్యకర్తలను ప్రలోభాలకు గురి చేస్తూ, టీడీపీలోకి భారీగా చేరికలంటూ సోషల్ మీడియాలో ఫేక్ ప్రచారం చేసుకుని సంబరపడిపోతున్నాడు. అయితే వారు మరుసటి రోజే తాము టీడీపీలో చేరలేదని, వైఎస్సార్‌సీపీలోనే కొనసాగుతామని స్పష్టం చేస్తున్నారు. ఇలా గత కొన్ని నెలలుగా వెంకటాచలం మండలంలో ఇదే తంతు కొనసాగుతోంది. తాజాగా మూడు రోజుల క్రితం చెముడుగుంటకు చెందిన యువకులు టీడీపీలో చేరారని సోమిరెడ్డి కండువాలు కప్పారు. అయితే ఈ యువకులంతా శుక్రవారం రాత్రి నెల్లూరు నగరంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని కలిసి తాము వైఎస్సార్‌సీపీలోనే కొనసాగుతామని స్పష్టం చేశారు. దీంతో సోమిరెడ్డి మతిలేని నిర్ణయాలతో మరోసారి నవ్వులపాలయ్యాడని సొంత పార్టీ నేతలే విమర్శిస్తున్నారు.

అనవసర విమర్శలు సరికాదు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: టీడీపీ కోవూరు నియోజకవర్గ ఇన్‌చార్జి దినేష్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ నేతలపై అనవసర విమర్శలు చేయడం మానుకోవాలని పెన్నా డెల్టా మాజీ చైర్మన్ యర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ మండల కన్వీనర్ చెర్లో సతీష్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికలు రెండు నెలల్లో ఉన్నాయని, ప్రజల మద్దతు ఎవరికుంటే వారే గెలుస్తారు తప్ప అనవసర మాటలు ప్రజలు విశ్వసించరని సూచించారు. ఇటీవల టీడీపీలో చేరిన నాయకుల అవినీతి గురించి బుచ్చిరెడ్డిపాళెంలో ప్రతిఒక్కరికీ తెలుసని, వారిపై గతంలో విమర్శలు చేసిన మీరు ఇప్పుడెలా పార్టీలో చేర్చుకుంటారని ప్రశ్నించారు. టీడీపీ హయాంలో ఒక్క అభివృద్ధి పని చేయకుండా వైఎస్సార్‌సీపీపై విమర్శలు చేయడం సరికాదన్నారు. పెన్నా కరకట్ట నిర్మాణం జిల్లా వ్యాప్తంగా జరుగుతోందని, తొమ్మిది మంది సభ్యుల నిర్ణయం మేరకు నిధులు ఖర్చు చేస్తున్నారనే కానీ ఏ ఒక్కరి నిర్ణయం ప్రకారం జరగదన్నారు. ఇలాంటివి తెలుసుకోకుండా అర్థరహిత విమర్శలు సబబు కాదన్నారు. వైఎస్సార్‌సీపీ టౌన్ కన్వీనర్ మల్లారెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే ప్రసన్న ఆధ్వర్యంలో జరిగిన అభివృద్ధి గతంలో జరిగిందా అని ప్రశ్నించారు. ఇవి తెలుసుకుని మాట్లాడాలని హితవు పలికారు. పార్టీ నేతలు పెద్ద అల్లాభక్షు, మోర్ల మురళి, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులకు సకాలంలో నీరు

• కృతజ్ఞతలు తెలిపిన రైతులు



మాట్లాడుతున్న రైతులు

విడవలూరు: ఈ వ్యవసాయ సీజన్‌లో రైతులకు సకాలంలో సాగునీరు అందిందని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి రుణపడి ఉంటామని వరిణి, దండిగుంట, రామతీర్థం, రామచంద్రాపురం గ్రామాలకు చెందిన రైతులు తెలిపారు. మండలంలోని వరిణి గ్రామంలో చెరువు కట్ట వద్ద ఐదు గ్రామాల రైతులు శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ రబీ సీజన్‌కు కోవూరు నియోజకవర్గాన్ని డెల్టా ప్రాంతం కింద ప్రకటించడంతో పొలానికి నీరు అందక రైతులు కొన్ని రోజులు ఇబ్బందులు పడ్డారని, అయితే ఈ సమస్యను వైఎస్సార్‌సీపీ నేతలు పూండ్ల అచ్యుత్‌రెడ్డి, కాటంరెడ్డి నవీన్‌రెడ్డి కలిసి కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఎమ్మెల్యే తన సొంత ఖర్చులతో మూడు జేసీబీలు పెట్టి కాలువల పూడికలు తీయించారని, వెంటనే తీర ప్రాంతాల చివర ఎకరా ఆయకట్టు వరకు నీరు చేరుతోందన్నారు. ఆయన చొరవ ఎనలేనిదన్నారు. కార్యక్రమంలో రైతులు బి.శ్రీధర్, బి.తిరుపతయ్య, కె.శీనయ్య, కరుణాకర్, చెంచురత్నం, డి.వెంకటేశ్వర్లు, నరేష్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.


దేవాంగ సంక్షేమ సంఘ సమావేశం నేడు

కోవూరు : పట్టణంలోని బుద్ధి పద్మావతి కల్యాణ మండపంలో కోవూరు దేవాంగ సంక్షేమ సంఘ అధ్యక్షుడు పి.మధుసూదన్‌రావు ఆధ్వర్యంలో ఆదివారం దేవాంగ సంక్షేమ సంఘ సమావేశం జరుగుతుందని సంఘ ప్రధాన కార్యదర్శి భువనగిరి మల్లికార్జునరావు శనివారం తెలిపారు. ఉదయం 10 గంటలకు జరిగే సమావేశంలో శ్రీరామలింగ చాముండేశ్వరీదేవి మహా కుంభాభిషేకం నిర్వహణపై చర్చిస్తామన్నారు. సమావేశానికి దేవాంగులు హాజరు కావాలని కోరారు.

డీఈఓను కలిసిన పీఆర్టీయూ నాయకులు

నెల్లూరు(టౌన్): జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డీఈఓ రామారావును పీఆర్టీయూ నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పీఆర్టీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటరాజు, తిరుమలయ్య మాట్లాడుతూ త్వరలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికలు, పదో తరగతి పరీక్షల విధులకు వయస్సు మళ్లిన, అనారోగ్యంతో బాధపడుతున్న వారితో పాటు చిన్న పిల్లల తల్లులకు మినహాయింపు ఇవ్వాలని కోరారు. డీఈఓను కలిసిన వారిలో పీఆర్టీయూ నాయకులు శ్రీనివాసులు, చెన్నయ్య ఉన్నారు.

వైభవంగా కుంభాభిషేక మహోత్సవాలు



నెల్లూరురూరల్: కనుపర్తిపాడులోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో పుష్కర కుంబాభిషేక మహోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. అందులో భాగంగా రెండో రోజు శనివారం వేదపండితుల ఆధ్వర్యంలో దేవదేవేరులకు విశేషాభిషేకాలు, పూజలు చేశారు. వేదపారాయణం, విశేషసంధి, అష్టబంధన సమర్పణ, సుబ్రహ్మణ్యేశ్వర సహిత సర్వమంత్ర హోమం, యాగ మండప పూజ, 108 ద్రవ్యాలతో నాగేంద్రస్వామి,జంట నాగదేవతల ప్రతిమలకు అభిషేకాలు జరిపారు. అష్టబంధనం పూజలో భాగంగా దంపతులతో రోళ్లు, రోకళ్లకు పూజలు చేసి అష్టబంధన ప్రసాదాన్ని దంచి తయారుచేసి స్వామి వారికి సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త వెందోటి చంద్రశేఖర్‌రెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం



ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్న

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: నగర పంచాయతీ పరిధిలో ఉన్న 18వ వార్డు మంగళకట్టలో పోలేరమ్మ ఆలయ నిర్మాణానికి కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి రూ.లక్ష విరాళంగా అందజేశారు. జొన్నవాడలో జరిగిన కార్యక్రమంలో కౌన్సిలర్ మోర్ల జయంతి, భరత్‌లకు నగదు అందించారు. అలాగే చెల్లాయపాళెం ఆర్బీకేలో టాయిలెట్స్ నిర్మాణానికి రూ.25,000 అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు కౌన్సిలర్ జయంతి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

‘టీడీపీ నేతల చిల్లర చేష్టలు’



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

తోటపల్లిగూడూరు : ‘ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో టీడీపీ నేతల చిల్లర చేష్టలు అధికమయ్యాయి, ఇప్పటికైనా వాటిని మానుకోవాలి’ అని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి తలమంచి సురేంద్రబాబు హితవు పలికారు. మండలంలోని పేడూరులో వైఎస్సార్‌సీపీ నాయకులు శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సురేంద్రబాబు మాట్లాడుతూ గతంలో ఓ నాయకుడు టీడీపీలో చేరుతూ కొందరు వైఎస్సార్‌సీపీ కార్యకర్తల ఫొటోలు ఫెక్సీలో వేయించుకున్నాడని, దీనిని ఇష్టపడని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు తాము జగనన్న అభిమానులమని, వైఎస్సార్‌సీపీలోనే కొనసాగుతామని స్పష్టం చేసినట్లు తెలిపారు. అయితే దీనిని జీర్ణించుకోలేని టీడీపీ నేతలు ఫ్లెక్సీల విషయంలో వైఎస్సార్‌సీపీ నాయకులు తప్పు చేశారని ప్రచారం చేయడం విడ్డూరంగా ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు ఉప్పల శంకరయ్యగౌడ్ మాట్లాడుతూ గతంలో మంత్రిగా గ్రామాలను అభివృద్ధి చేయని సోమిరెడ్డి.. ప్రస్తుతం గ్రామాల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నం చేస్తున్నాడన్నారు. ప్రజల మద్దతు లేని సోమిరెడ్డి దుగజారుడు రాజకీయాలు చేస్తున్నాడని మండిపడ్డారు. కార్యక్రమంలో పేడూరు సొసైటీ అధ్యక్షుడు తూపిలి ఉదయ్‌కుమార్‌రెడ్డి, పార్టీ నేతలు మన్నెం చిరంజీవులగౌడ్, ఆకుల మధు, అల్లాభక్షు, సాదేపల్లి సామ్సన్ పాల్గొన్నారు.

20న రుద్రాభిషేకం



మాట్లాడుతున్న ప్రసాద్‌స్వామి

పొదలకూరు : పట్టణంలోని చోళుల కాలం నాటి కామాక్షితాయి సమేత రామలింగేశ్వరస్వామి, విఘ్నేశ్వరాలయాల్లో ఈనెల 20వ తేదీన మాఘమాసం, ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని మహన్యాసపూర్వక రుద్రాభిషేకం నిర్వహిస్తామని దేవస్థానం ప్రధానార్చకుడు పీబీఎస్‌వీ ప్రసాద్‌స్వామి వెల్లడించారు. దేవస్థానంలో ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ శివకేశవులకు ప్రీతికరమైన భీష్మ ఏకాదశి రోజున రుద్రాభిషేకంతో పాటు సామూహిక కుంకుమార్చన జరుగుతుందన్నారు. ఉదయం 8 గంటలకు పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామని, మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాల్సిందిగా కోరారు. ఈ సమావేశంలో చొప్పా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సోమిరెడ్డివి పచ్చి అబద్ధాలు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

ముత్తుకూరు : అభివృద్ధి చేశానంటూ టీడీపీ నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చెబుతున్న మాటలు పచ్చి అబద్ధాలని మండలంలోని బ్రహ్మదేవి పంచాయతీ వైఎస్సార్‌సీపీ నేతలు అన్నారు. ఇక్కడ సీసీరోడ్లు, సైడు డ్రెయిన్లు నిర్మించింది మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డి అని తెలిపారు. మండలంలోని బ్రహ్మదేవిలో జెడ్పీటీసీ సభ్యుడు బందెల వెంకటరమణయ్య, సర్పంచ్ వెందోటి సుధాకర్, మాజీ సర్పంచ్ కట్టా సుబ్రహ్మణ్యం, పార్టీ నేతలు మస్తాన్, జమీల్, బషీర్, చెంగయ్య తదితరులు శనివారం విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యేగా కాకాణి గోవర్ధన్ రెడ్డి బ్రహ్మదేవి గిరిజనకాలనీ ప్రధాన రోడ్డు నిర్మాణానికి రూ.26 లక్షలు, 18 అడ్డ వీధుల్లో సీసీ రోడ్లకు రూ.33 లక్షలు మంజూరు చేశారని గుర్తుచేశారు. ఈ పంచాయతీకి సోమిరెడ్డి చేసిందేమీలేదన్నారు. కాలనీలో కొందరికి సోమిరెడ్డి బలవంతంగా కండువాలు కప్పారని మండిపడ్డారు.